తాను ఏం మాట్లాడాలో
తెలిసిన వాడు తెలివైన వాడు
తాను ఏం మాట్లాడకూడదో
తెలుసుకోగలిగినవాడు వివేకవంతుడు
-స్వామి వివేకానంద

Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 319 | ఆదివారం 07 జూన్ 2026 | పేజీలు : 8 వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## కాంగ్రెస్ అంటేనే అరాచకం, అనిశ్చితి

- ప్రజలు పదే పదే తిరస్కరిస్తున్నారు.. అందుకే రాష్ట్రాల్లో అసంతృప్తి
- గుజరాత్, దమన్‌లలో రూ.20,970 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం



2

## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- ఇరాన్ డ్రోన్లను కూల్చిన అమెరికా సైన్యం
- హార్మూజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తతలు



2



## సహారా ఎడారిలో మృత్యు ఘోష

- నీళ్లు లేక 49మంది మృత్యువాత

2



## నీట్ అవకతవకలపై జంతర్‌మంతర్‌లో నిరసన జ్వాలలు

- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- నిరసనకు మద్దతుగా హాజరైన విద్యా సంస్కర్త సోనమ్ వాంగ్‌చుక్

2

## నీట్ రీ ఎగ్జామ్ పేపర్ లీక్ పుకార్లు

- దుష్ప్రచారాలపై మండిపడ్డ ఎన్‌టిఎ
- కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

2



## రష్యాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన

- యాండెక్స్ ప్రతినిధులతో సమావేశం

అమరావతి- సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన.. ప్రముఖ టెక్ సంస్థ యాండెక్స్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో

- మిగతా 2లో..


## మద్యనిషేధ హామీని గాలి కొదిలేసిన జగన్

- సిపిఎస్ రద్దు చేస్తామని మోసం చేసిన వైసిపి
- జాబ్ క్యాలెండర్ పేరుతోనూ మోసం చేశారు
- టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో భేటీ చంద్రబాబు విమర్శలు

అమరావతి- సూర్య వాస్తవం

మద్యపానం నిషేధం చేస్తామని హామీ ఇచ్చి గొడ్డలి పార్టీ చేతులెత్తేసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. వైసీపీ హయాంలో సీపీఎస్ వారం రోజుల్లో రద్దు చేస్తామని చెప్పి ఎందుకు పక్కన పెట్టేసిందని ప్రశ్నించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై దిశనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని గొడ్డలి పార్టీ మాట తప్పిందని ధ్వజమెత్తారు. ఇంతటితో ఆగకుండా వ్యవస్థలను విధ్వంసం చేసిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో చెప్పినవి చేయకపోగా తమ ప్రభుత్వం నిర్వహించిన

- మిగతా 2లో..



## జలవనరుల ఆక్రమణదారులపై హైడ్రా ఉక్కుపాదం

- చెరువులు, కుంటల రక్షణలో రాజీ లేదు : సీఎం రేవంత్ రెడ్డి
డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ ఫోర్స్ దేశానికే ఆదర్శం

2

## కోహెడకు అంతర్జాతీయ గుర్తింపు..

- సీఎం రేవంత్ రెడ్డి

- రైతు అభివృద్ధికి మెగా ఫ్రూట్ మార్కెట్
- కోహెడలో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్‌కు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన.
- కోహెడకు అంతర్జాతీయ గుర్తింపు..
- రైతు అభివృద్ధికి మెగా ఫ్రూట్ మార్కెట్
- కోహెడలో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్‌కు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన
- డిసెంబర్ నాటికి మార్కెట్ ప్రారంభం..
- కందుకూరులో టమోటా సాస్ పరిశ్రమ ఏర్పాటు




అమరావతి- సూర్య వాస్తవం

తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా కోహెడలో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ, హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తుండటం తో ప్రజల ఆహార అవసరాలకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ మార్కెట్ల అవసరం పెరిగిందన్నారు. గతంలో తాత్కాలిక షెడ్లలో నిర్వహించిన మార్కెట్లలో భద్రతా లోపాలు కారణంగా ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, అందుకే 240 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సమీకృత ఫ్రూట్ మార్కెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

**శంషాబాద్ తర్వాత కోహెడకు ప్రత్యేక గుర్తింపు**

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత రాష్ట్రానికి

- మిగతా 2లో..



## ఎన్టీపిసిపై యాష్‌తో కాలుష్యం

- నివారణ చర్యలపై అధికారులతో పవన్ సమీక్ష

విజయవాడ,- సూర్య వాస్తవం

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ నుంచి వెలువడుతున్న ఫ్లై యాష్ (బూడిద) కాలుష్య సమస్య ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి చేరింది. మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్,

- మిగతా 3లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# సహారా ఎడారిలో మృత్యు ఘోష

## - నీళ్లు లేక 49మంది మృత్యువాత

**సహారా– సూర్య వాస్తవం:** పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు. చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు. విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలసవెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు. గతంలోనూ అనేక మంది ఇసుక వేడి, దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తుచేసుకున్నారు.

# కాంగ్రెస్ అంటేనే అరాచకం, అనిశ్చితి

**- ప్రజలు పదే పదే తిరస్కరిస్తున్నారు.. అందుకే రాష్ట్రాల్లో అసంతృప్తి**

**- గుజరాత్, దమణ్‌లలో రూ.20,970 కోట్ల**

**- అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం**

**సూరత్ – సూర్య వాస్తవం:**
దేశంలో గత 12 ఏళ్లుగా అరాచకాన్ని, అనిశ్చితిని సృష్టించి రాజకీయ ప్రయోజనాలు పొందాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ విధానాలను తిరస్కరిస్తూ ఎన్నికల్లో వరుసగా గుణపాఠం చెబుతున్నారని పేర్కొన్నారు. గుజరాత్‌లో రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం సూరత్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు.

దేశం స్వయం సమృద్ధి సాధించడం కొందరు రాజకీయ ప్రత్యర్థులకు ఇష్టం లేదని, భారత్ ఎప్పటికీ ఇతర దేశాలపై ఆధారపడాలనే ఆలోచనతో వారు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దేశాభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకే ప్రజలు వరుసగా ఆశీర్వదిస్తూ విజయాలు అందిస్తు న్నారని తెలిపారు. అరాచకత్వం, నిరాశావాద రాజకీయాలను దేశ ప్రజలు ఎప్పటికీ ఆమోదించరని, కాంగ్రెస్ మాత్రం వాటినే ఆశ్రయించి రాజకీయ అవకాశాలు వెతుకుతోందని అన్నారు.

**కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి**
కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సైతం ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని ప్రధాని పేర్కొన్నారు. ఇటీవల హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలిందని, హరియాణాలోనూ ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని గుర్తుచేశారు. కర్ణాటకలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగిందని, అందుకే అక్కడ నాయకత్వ మార్పు చర్చకు వచ్చిందని వ్యాఖ్యానించారు.

**రూ.20,970 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు**
గుజరాత్ పర్యటన అనంతరం దమణ్ చేరుకున్న ప్రధాని మోదీ అక్కడ రూ.2,970 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. గుజరాత్, దమణ్‌లలో కలిపి మొ త్తం రూ.20,970 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

**7.7 శాతం వృద్ధితో భారత్ ముందంజ**
ఈ సందర్భంగా దేశ ఆర్థిక పరిస్థితిపై మాట్లాడిన ప్రధాని, 2025–26 ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.7 శాతం వృద్ధి రేటు నమోదు చేసిందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందని, దేశ ఆర్థిక పునాదులు మరింత బలపడుతున్నాయని తెలిపారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

# జలవనరుల ఆక్రమణదారులపై హైడ్రా ఉక్కుపాదం

**- చెరువులు, కుంటల రక్షణలో రాజీ లేదు : సీఎం రేవంత్ రెడ్డి**

**- డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ ఫోర్స్ దేశానికే ఆదర్శం**

**హైదరాబాద్– సూర్య వాస్తవం:**
తెలంగాణ రాష్ట్రంలో జలవనరుల పరిరక్షణను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని 'హైడ్రా' వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలి పారు. చెరువులు, కుంటలు, ఇతర జలవనరులను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నా మని, ప్రస్తుతం వాటి జోలికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. బెంగళూరులో నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అమలవుతున్న హైడ్రా, ఈగల్ ఫోర్స్ పనితీరుపై వివరించారు. కొందరు ధనికులు విలాసవంతమైన భవనాలు, ఫామ్‌హౌస్‌ల నిర్మాణం కోసం చెరువులు, కుంటలను ఆక్రమించడమే కాకుండా వాటిలో వ్యర్థాలను వదిలి పర్యావరణానికి హాని కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి నాయకత్వంలో సుమారు 3,000 మంది సిబ్బందితో హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. ఆక్రమణలు ఎవరు చేసినా ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

**డ్రగ్స్ నిర్మూలనలో ఈగల్ ఫోర్స్ కీలకం**
రాష్ట్రంలో డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు ఏర్పాటు చేసిన 'ఈగల్ ఫోర్స్' దేశంలోనే ఆదర్శవంతమైన వ్యవస్థగా నిలిచిందని సీఎం అన్నారు. హైడ్రా, ఈగల్ ఫోర్స్ కార్యక్రమాలపై దేశవ్యాప్తంగా ఆసక్తి వ్యక్తమవుతోందని పేర్కొన్నారు.

**యువత నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టాలి**
ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావంతో ఉపాధి రంగంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని సీఎం తెలిపారు. వైట్ కాలర్ ఉద్యోగాలకు మాత్రమే పరిమితం కాకుండా యువత బ్లూ కాలర్ ఉద్యోగాల్లోనూ ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే భవిష్యత్తులో మెరుగైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా యువత తమ సామర్థ్యాలను పెంపొందించుకుని కొత్త రంగాల్లో రాణించాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# మధ్యనిషేధ హామీని గాలి కొదిలేసిన జగన్

(మొదటిపేజీ తరువాయి)
డీఎస్సీ–2025పై బురద జల్లుతోందని ఆగ్రహించారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో... డీఎస్సీ విషయం లోనూ దుష్ప్రచారంతో లబ్ధిపొందాలనుకున్నారని దుయ్యబట్టారు.
డీఎస్సీ నిర్వహణపై ఆధారాలతో సహా జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌తో గొడ్డలి పార్టీ నేతలు డిఫెన్సులో పడ్డారని చెప్పుకొచ్చారు. దుష్ప్రచారం చేయడం, ఫేక్ రాజకీయాలు చేయడం గొడ్డలి పార్టీ విధానం, సిద్ధాంతమని విమర్శించారు. అధికారంలో ఉన్నామని... సహనం, ఓపిక అవసరమని.. కానీ గొడ్డలి పార్టీ ఆగడాలు శ్రుతిమించితే వదిలిపెట్టమని హెచ్చరించారు. మంచి ఆలోచనలు చేసే వాళ్లకు మంచి వాళ్లే సహాయపడతారని అన్నారు. చెడు ఆలోచనలు చేసే వాళ్ల చుట్టూ గొడ్డలి బ్యాచ్ జమ అవుతుందని ఎద్దేవా చేశారు. ఇకపై టీడీపీకి ఓటమి లేదని, రాదని తెలిపారు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలతో మంచిగా ఉంటున్నామని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నామని.. సంక్షేమ పథకాలు – అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చామని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని.. అందుకే టీడీపీకి ఓటమి రాదని పేర్కొన్నారు. పార్టీ పదవులు మొదలుకుని టికెట్ల కేటాయింపుల వరకు నిరంతరం సర్వేలు చేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటు న్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వాళ్లని వదిలించుకుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఏం ప్రచారం చేశారో... అవన్నీ తమ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచిని గడప గడపకు వెళ్లి చెప్పాలని దిశానిర్దేశర చేశారు. ఆనాడు చెప్పిన వాటిని ఈనాడు నెరవేరుస్తున్నామనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. మంగళగిరిలో టీడీపీ గెలిచి చాలా కాలమైందని... 2019 ఎన్నికల్లో నారా లోకేశ్ పోటీ చేసినా ఓడిపోయారని ప్రస్తావించారు. ఆ తర్వాత పట్టుపట్టి పనిచేశారని.. 2024లో అద్భుత విజయం సాధించారని ప్రశంసించారు. గెలిచిన తర్వాత కూడా మంగళగిరిలో లోకేశ్ చక్కగా పని చేస్తున్నారని.. ఇప్పుడు మంగళగిరి టీడీపీకి కంచుకోటగా మారిందని చెప్పుకొచ్చారు. యుద్ధాన్ని గెలిపించే బాధ్యత తనదని... తనతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత టీడీపీ శ్రేణులదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకు నేందుకు పార్టీ పరంగా చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపు చ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళ్తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు. దీనికి అనుగు ణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు బీజేపీతో పొత్తులో ఉన్నా కూడా ఓట్లు చీలకూడదనే.. టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా వెళ్లడంతోనే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచామని ప్రస్తావించారు. పార్టీ అగ్రనేతలు మొదలుకుని... కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ బ్రాడ్ మైండ్‌తో ఆలోచించాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు.

# నీట్ అవకతవకలపై జంతర్‌మంతర్‌లో నిరసన జ్వాలలు

**- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్**

**- నిరసనకు మద్దతుగా హాజరైన విద్యా సంస్కర్త సోనమ్ వాంగ్‌చుక్**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**
దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నీట్ పరీక్షల అవకతవకల వ్యవహారంపై శనివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు వెల్లువెత్తాయి. పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే నేతృత్వంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమానికి ప్రముఖ విద్యా సంస్కర్త, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ హాజరై సంఘీభావం ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే అంశాల్లో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. ఈ నిరసనలో ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమం శాంతియుతంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఢిల్లీ పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. జంతర్‌మంతర్ పరిసర ప్రాంతాలతో పాటు నగరంలోని కీలక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలు, పారామిలటరీ సిబ్బందిని మోహరించినట్లు అధికారులు తెలిపారు. నీట్ పరీక్షల వ్యవహారంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నిరసన కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది.

# నీట్ రీ ఎగ్జామ్ పేపర్ లీక్ పుకార్లు

**- దుష్ప్రచారాలపై మండిపడ్డ ఎన్‌టిఎ**

**- కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం:**
నీట్ – యూజీ రీ–ఎగ్జామ్ పేపర్ సైతం లీక్ అయిందంటూ వస్తోన్న ఆరోపణల్ని ఎన్‌టీఏ ఖండించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ దుష్ప్రచారం అవాస్తవం, మోసపూరితమని పేర్కొంది. తప్పుడు ప్రచారం వ్యాప్తి చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టింది. విద్యార్థులు, తల్లిదండ్రులను తప్పుదారి పట్టించే లక్ష్యంతోనే ప్రశ్నపత్రం లీక్, అడ్వాన్స్ యాక్సెస్ లేదా విక్రయం జరిగిందంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నట్లు తాము గుర్తించినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. ఈ ÷–లకెయిమ్‌లన్నీ పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. నీట్‌ను పారదర్శకంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంది అభ్యంతరకర ఛానళ్లు, ఖాతాల్లో కంటెంట్‌ను గుర్తించి.. వాటిని తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకొనేందుకు ఆయా ఎ÷–లాట్‌ఫాంలు, సైబర్ క్రైమ్ అధికారులకు నివేదిస్తున్నట్లు తెలిపింది. ఇలాంటి మోసపూరిత కంటెంట్‌ను సృష్టించి.. ప్రచారం చేయడం, ఇతరులకు ఫార్వార్డ్ చేయడం ద్వారా విద్యార్థుల్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం తీవ్రమైన నేరమని హెచ్చరిస్తూ.. దీనిపై అధికారికంగా ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొంది. ఇలాంటి కంటెంట్‌ను ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, మోసగాళ్ల మాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. బయట వచ్చే ఊహాగానాలను నమ్మొద్దని, ఎన్‌టీఏ వెర్ఫి÷డ్ ఛానల్స్‌లో వచ్చిన సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరింది. దేశ వ్యాప్తంగా మే 3న నీట్ పరీక్ష జరగ్గా.. ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం తీవ్ర దుమారం సృష్టించిన విషయం తెలిసిందే. ఎన్‌టీఏ పనితీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో మే 12న ఆ పరీక్షను రద్దు చేసి తిరిగి జూన్ 21న నిర్వహిస్తామని ఎన్‌టీఏ ప్రకటించింది. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేసు నమోదు చేసిన సీబీఐ ప్రస్తుతం దర్యాప్తు కొనసాగిస్తోంది. మరోవైపు, నీట్ యూజీ రీఎగ్జామ్ ప్రశ్నపత్రాన్ని ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన సురక్షితమైన ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించే అవకాశం ఉందంటూ వచ్చిన వార్తలను కేంద్రం ఖండించింది. ఇది పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పింది. ఆర్థికశాఖ నీట్ యూజీ రీఎగ్జామ్ పేపర్‌ని ముద్రించడంలేదని స్పష్టం చేస్తూ పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టింది. అధికార వర్గాల సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరింది.

# రష్యాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)
అమరావతి, విశాఖపట్నంలో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థల అమలుపై కీలక చర్చలు జరిగాయి. ప్రిడిక్టివ్ ట్రాన్సిట్ షెడ్యూలింగ్, పబ్లిక్ సేఫ్టీ అనలిటిక్స్, ఎఐ ఆధారిత ట్రాఫిక్ మానిటరింగ్ సిస్టమ్స్‌ను రెండు నగరాల్లో ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలించినట్లు సమాచారం. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఆధునిక టెక్నాలజీ వినియోగంపై ప్రత్యేకంగా చర్చలు జరిగాయి. లాస్ట్ మైల్ రవాణా ఖర్చులను తగ్గించే మార్గాలపై కూడా లోకేష్ సూచనలు చేశారు. అలాగే క్విక్ కామర్స్, డెలివరీ ఫ్లీట్లలో ఆటోనమస్ వెహికల్స్ వినియోగంపై యాండెక్స్ బృందంతో చర్చించారు. విశాఖలో ఏర్పాటు చేయనున్న ఎఐ డేటా సెంటర్‌కు సాంకేతిక భాగస్వామ్యం, అలాగే హై–పెర్ఫార్మెన్స్ క్లౌడ్ ఫ్రేమ్‌వర్క్‌ల వినియోగంపై కూడా సమావేశంలో చర్చలు జరిగినట్లు తెలిసింది. స్థానిక పరిపాలనలో ంఎ మోడల్స్ వినియోగంపై సమావేశంలో చర్చలు జరిపారు. రష్యాలోని స్బేర్ సిటీలో యాండెక్స్ ఉన్నతస్థాయి బృందంతో కూడా మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఐదవ రోజు పలు కీలక సంస్థలతో ఆయన వరుస సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.



## సంపాదకీయం

# ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట ఏదీ ?

ఆర్థిక కుంభకోణాలు, మోసాలను పసిగట్టలేక పోతున్నారు. దేశంలో ఎవరు ఎలా దోచేస్తున్నారో గుర్తించడం లేదు. అధికారంలో ఉన్నవారిది ఒక ర కమైన దోపిడీ, ఆర్థికంగా ఉన్నవారిది మరో రకమైన దోపిడీ అన్నట్లుగా కాలం నడుస్తోంది. అధికారంలో ఉండి ఆర్థిక మోసాలకు పాల్పడ్డ వారిని ఏమీ చేయడం లేదు. వారు అక్రమాలకు పాల్పడ్డట్లు రుజువులున్నా బోను ఎక్కించడం లేదు. తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా చేస్తున్న పనులపై నిఘా లేకుండా పోయింది. అజమాయిషీ లేదు. విచారణలు లేవు. తెలంగాణలో కాళేశ్వరం కథ కంచికి చేరింది. లక్షకోట్లు పెట్టి ఓ ప్రాజెక్ట్ కడితే అందులో అవతవకలు, ఆర్థిక మోసాలు జరిగాయన్న వారే దానిపై విచారణ జరిపించడం లేదు. ఇ- కార్ రేసులో నేరుగా విదేశీ సంస్థకు డబ్బులు చెల్లించినా కిమ్మనడం లేదు. ఎపిలో రుషికొండపై జగన్ ప్యాలెస్‌లు కట్టుకుంటే చర్యలు లేవు. మద్యం కుంభకోణానికి పాల్పడితే దిక్కులేదు. భూకుంభకోణ్యాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే దేశంలో అనేక ఆర్థిక మోసాలు జరిగాయి. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, లలిత్ మోడీ వంటివారు దేశం బయటనే ఉన్నారు. వారిపై ఎలాంటి చర్యలు లేవు. దేశంలో కొందరు బ్యాంకులకు ఎగనామం వేస్తున్నా పట్టింపు లేదు. ఇవన్నీ కూడా ఇతరకుల ఆదర్శంగా నిలుస్తున్నాయని భావించాలి. తాజాగా రాజేష్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఆర్‌ఇఎల్) భారీ ఆర్థిక అరాచకం దేశంలోనే కాదు అంతర్జాతీయ కార్పొరేట్ రంగాన్ని షేక్ చేస్తోంది. ఇలాంటి వారు మోసం చేస్తున్నా..గుర్తించలేక పోయారు. ఎల్‌ఐసి లాంటి సంస్థ ఇందులో పెట్టుబడులు పెట్టి ఇప్పుడు భారీగా నష్టపోయింది. ఆర్థిక మోసాలను ఎంత చాకచక్యంగా చక్కబెట్టవచ్చో 'లక్కీ భాస్కర్' మూవీలో చూపించారు. 1980లనాటి షేర్ల స్కామ్ కింగ్ పిన్ బిగ్‌బుల్ హర్షద్ మెహతా షేర్ మార్కెట్‌ను ఎలా మోసం చేశడో గుర్తుండే ఉంటుంది. వ్యవస్థలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకొంటున్న పలువురు భారీ అక్రమాలకు బరితెగిస్తున్నారు. వారి చేతుల్లో ఎంతోమంది అమాయకులు మోసపోతున్నారు. సహారా ఇండియా, అగ్రిగోల్డ్, లీఫిన్ ఇండియా లాంటి సంస్థలు కూడా ఎంతగా మోసం చేశాయో చూసాం. ఇటీవల నల్లగొండ, కర్నూలు జిల్లాలో మైక్రో ఫైనాన్స్ మోసం బయటపడింది. అయినా ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదు. కఠిన నిర్ణయాలు తీసుకోవడం లేదు. చిట్టీల పేరుతో గ్రామాలు మొదలు పట్టణ్యాల వరకు కోట్లల్లో మోసలు చేస్తూనే ఉన్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన ప్రముఖ బంగారం, ఆభరణాల దిగ్గజం ఆర్‌ఇఎల్ తన వాస్తవ ఆదాయాన్ని రూ.15.15 లక్షల కోట్లు అధికంగా చూపించి, తన షేర్ వాల్యూను భారీగా పెంచుకొని, మదుపరులను, అలాగే ప్రభుత్వ వ్యవస్థలను మోసగించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని సెక్యూర్టీస్ అండ్ ఎక్సేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా సెబి విచారిస్తే తప్ప వెలుగులోకి రాలేదు. ఆర్‌ఇఎల్ స్కాం దేశ కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా చెబుతున్నారు. ఇలాంటి స్కామే 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సత్యం కంపెనీలో జరిగింది. రూ.7,800 కోట్ల మేర కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌లో తేడా వచ్చింది.

ఎక్కువ ఆదాయం చూపించి సత్యం కంపెనీ షేర్ విలువను పెంచుకుందని ఆరోపణలొచ్చాయి. ఈ కేసులో సత్యం కంపెనీ అధినేత రామలింగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ కంపెనీ ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా 2003 జనవరిలో బయటపెట్టడం పెను సంచలనం అయింది. ఆదానీ గ్రూపు తమ షేర్ విలువను పెంచుకునేందుకు గ్రూపు ఆదాయాన్ని అధికంగా చూపించడంతోపాటు పలు ఆర్థిక అవకతవకలకు పాల్పడిందన్నది ప్రధాన అభియోగం. దాంతో అదానీ ఆర్థిక సామ్రాజ్యం రూ.లక్షల కోట్ల మేర పతనమైంది. తూతూ మంత్రంగా సెబి దర్యాప్తు సాగింది. చివరికి అదానీ గ్రూపుపై 'హిండెన్‌బర్గ్'వి ఆధారాల్లేని ఆరోపణలుగా కొట్టిపారేసింది. ఉదారవాద ఆర్థిక విధానాలే ఆర్థిక స్కాంలకు మూలం. ఓ సామాన్యుడు సెబీకి లేఖ రాయడం, అది విచరణ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్‌ఇఎల్ కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రాజేష్ మెహతాను సెక్యూర్టీస్ మార్కెట్ నుంచి తాత్కాలికంగా నిషేధించింది. ఆర్‌ఇఎల్ అక్రమాలను కేంద్ర ప్రభుత్వ సంస్థలుకానీ, నిఘా విభాగాలు కానీ గుర్తించలేకపోవడం వ్యవస్థీకృతంగా ఉన్న జాడ్యంగా చూడాలి. ఒక సాధారణ ఇన్వెస్టర్ 2025లో ఇ-మెయిల్‌లో చేసిన ఫిర్యాదుతో తీగ లాగితే డొంక కదిలింది. సెబి రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టినా, కంపెనీకి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను చూపించమని పలు మార్లు నోటీసులిచ్చినా ఆర్‌ఇఎల్ యాజమాన్యం సహకరించలేదు. అందుకే సెబి ఆ సంస్థ స్కాంపై నివేదిక వెల్లడించాల్సి వచ్చింది.

రార్పొరేట్ స్కాంలన్నింటిలో దండలో దారంలో కనిపించేది విదేశాల్లో ఆ సంస్థలు ఏర్పాటు చేసే అనుబంధ షెల్, సూట్‌కేస్ కంపెనీలు, వాటి ద్వారా ఈ దేశంలో అక్రమాలు. ఆర్‌ఇఎల్ కూడా అదే చేసింది. సిట్జర్లాండ్ నుంచి కథ నడిపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ రిఫయినరీ 'వాల్కంబీ'ని 2015లో కొనుగోలు చేసింది. సంస్థ ఆదాయాన్ని రూ.వందల కోట్లను వేలు లక్షల కోట్లుగా తప్పుడు పద్ధతుల్లో చూపించింది. సంస్థ సి.ఎం.డి. రాజేష్ మెహతా తన వ్యక్తిగత ఖాతాలకు సంస్థ నిధులను భారీగా నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారు. సంస్థలో కీలక స్థానాల్లో ఉన్న మరి కొంత మంది సైతం ఇదే పని చేశారు. ఈ కఠోర విషయాలను సెబినే వెల్లడించింది. కంపెనీ కార్పొరేట్ గవర్నెన్స్ లోపభూయిష్టంగా ఉందని ఇప్పుడు గుర్తించడం ప్రభుత్వ వ్యవస్థల పనితీరులో డొల్లతనానికి నిదర్శనం. ఇలాంటివి ఇంకా ఎన్ని జరుగుతున్నాయో తెలియదు. బయటపడితే తప్ప తెలుసుకోలేం. ప్రజలు అనేక విధాలుగా ఇప్పుడు మోసపోతున్నారు. ఈ క్రమంలో పకడ్బందీ చర్యలతో ఆర్థిక మోసాలకు కళ్లెం వేయాలి. కేవలం సైబర్ మోసాలే కాకుండా ఇలాంటి బడా మోసాలపైనా దృష్టి సారించాలి.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

**- ఇరాన్ డ్రోన్లను కూల్చిన అమెరికా సైన్యం**
**- హ్మూజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తతలు**

టెహ్రాన్ - సూర్య వాస్తవం

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మర ణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది.

ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహా సముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభ పడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరి కొన్ని ఆర్థిక ఆంక్షలను విధిం చింది.

ఇరాన్-అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభు త్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది.

ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చు కుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవా లన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనా న్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.

# కోహెడకు అంతర్జాతీయ గుర్తింపు..





(మొదటిపేజీ తరువాయి)

మరో ప్రతిష్టాత్మక గుర్తింపుగా కోహెడ ఫ్రూట్ మార్కెట్ నిలుస్తుందని సీఎం పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేస్తామని, ఈ ఏడాది డిసెంబర్ నాటికే మార్కెట్ కార్యకలాపాలు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండేళ్లలో పూర్తి స్థాయి ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

**రైతులకు మార్కెటింగ్, ప్రాసెసింగ్ సదుపాయాలు**

వ్యవసాయం లాభసాటిగా మారాలంటే పంటల ఉత్పత్తితో పాటు మార్కెటింగ్, కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో కందుకూరు ప్రాంత టమోటా రైతులకు మేలు చేకూర్చేందుకు టమోటా సాస్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

**సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**

రాష్ట్రంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను ఆపే ప్రసక్తే లేదని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటికే రూ.20 వేల కోట్ల రైతు రుణమాఫీ పూర్తి చేశామని, 15 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. అలాగే 3.28 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు.

**రాష్ట్ర అభివృద్ధికి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు**

రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 'భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, రీజనల్ రింగ్ రోడ్, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని సీఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్, కసిరెడ్డి నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**- ఎదురెదురుగా ఢీకొన్న ట్రక్కులు**
**- 8మంది ప్రయాణికుల దుర్మరణం**

చండీగఢ్ - సూర్య వాస్తవం


పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్-ఫాజిల్కా రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు ట్రక్కులు ఎదురెదురుగా ఢీకొని 8మంది ప్రాణాలు కోల్పోగా.. 15మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా ఇటీవల మృతిచెందిన తమ బంధువు అస్థికలను నీటిలో కలిపేందుకు వెళ్తుండగా ఈ ఘోరం జరిగింది. ప్రమాదానికి గురైన వారిని జలాలాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. బాధితులు తమ బంధువు అస్థికలను తీసుకుని బియాస్‌లోని రాధా సోమి దేరాకు శనివారం ఉదయం ప్రయాణం మొదలుపెట్టారు. సుమారు 25 మంది మహీంద్రా పికప్ వాహనంలో బయలుదేరారు. అయితే, వాహనం జంగవాలా గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వచ్చిన మరో ట్రక్కును ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మరణించగా.. మరో నలుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ఫిరోజ్‌పూర్ లోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. కుటుంబ సభ్యులు, బంధువుల మృతితో ప్రమాద స్థలం, ఆస్పత్రి ప్రాంగణంలో బాధితుల రోదనలు మిన్నంటాయి. మరోవైపు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఎన్టీపిసిపై యాష్‌తో కాలుష్యం

(మొదటిపేజీ తరువాయి)

జనసేన నాయకుడు అక్కల గాంధీ ఈ సమస్యను పవన్ కల్యాణ్‌కు వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మూలపాడు గ్రామానికి వచ్చిన పవన్ కల్యాణ్‌ను స్థానిక నాయకులు కలిసి ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. విద్యుత్ కేంద్రం నుంచి వెలువడుతున్న యాష్ కారణంగా పరిసర గ్రామాల్లో పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి, వ్యవసాయ భూములకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై పవన్ కల్యాణ్ సుమారు అరగంట పాటు స్థానిక నాయకులు, సంబంధిత వర్గాలతో చర్చించారు. బూడిద కాలుష్యం వల్ల రైతులు, గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్టీటీపీఎస్ నుంచి వెలువడ్గే ÷÷-ల యాష్ కారణంగా చెట్లు, పంటలు, పశువులు ప్రభావితమవుతున్నాయని, గ్రామాల్లో గాలి కాలుష్యం పెరుగుతోందని స్థానికులు చాలా కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఏపీ జెన్కో అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు శుభాకాంక్షలు



**హైదరాబాద్ - సూర్య వాస్తవం:** కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన డీకే శివకుమార్‌కు, అలాగే కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన బీకే హరిప్రసాద్‌కు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, గుల్బర్గా ఎమ్మెల్సీ జగదేవ్ గుత్తేదార్‌తో కలిసి నూతన బాధ్యతలు చేపట్టిన నేతలను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మాదు సత్యం గౌడ్, డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ పాల్గొని పుష్పగుచ్ఛాలు అందజేసి శుభా కాంక్షలు తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో నూతన నాయకత్వం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సమావేశం స్నేహపూర్వక వాతా వరణంలో కొనసాగగా, రెండు రాష్ట్రాల కాంగ్రెస్ నాయకుల మధ్య పరస్పర సహకారం, పార్టీ బలోపేతంపై చర్చలు జరిగినట్లు సమాచారం.

## నూతన ఎమ్మార్వో ను కలిసిన మాజీ డిసిఎంఎస్ చైర్మన్



**అనంతపురం - సూర్య వాస్తవం :**కూడేరు మండల ఎంఆర్వో గా మోహన్ కుమార్ భాద్యతలు తీసుకున్న సందర్భంగా మాజీ డి సి ఏం ఎస్ చైర్మన్ సోమరా జయచంద్ర నాయుడు శనివారం నాడు మర్యాపూర్వంకా కలిసి సన్మానించారు. ఆయనతో పాటు మాజీ ఉప మండల అధ్యక్షులు జల్లప్ప, అక్కులన్న, అశోక్, రమణ తదితరులు ఉన్నారు

# సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి

## - న్యాయవాదులు డిమాండ్




**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం :** రెవిన్యూ డివిజనల్ కేంద్రమైన పత్తికొండలో సబ్ కోర్టు (సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ) ఏర్పాటు చేయాలని ఇండియన్ అసోసియేషన్ అఫ్ లాయర్స్ (ఐ. ఏ.ఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. సురేంద్ర కుమార్, వైస్సార్సీపీ లీగల్ సెల్ పత్తికొండ తాలూకా అధ్యక్షులు కె. నరసింహాయ్య, పత్తికొండ బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్స్ ఎం. సోమప్ప, ఎం.మల్లికార్జునలు డిమాండ్ చేశారు. శనివారం పత్తికొండలో స్థానిక బార్ అసోసియేషన్ భవనం దగ్గర ఐ. ఏ. ఎల్. ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రెవిన్యూ డివిజన్ కేంద్రనైనా పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు అవసరం ఎంతైనా ఉందన్నారు.పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. ప్రస్తుతం ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ రెవిన్యూ డివిజన్ లకు కలిపి ఆదోనిలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఉందని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మిగనూరులో ఒక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు కు మంజూరు చేసిందని, అలాగే ఆదోనిలో ఒక అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు కు రాష్ట ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.ఆదోనిలో ఇప్పటికే సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఉందని అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో సీనియర్ సివిల్ జడ్జి కోర్టును మంజూరు చేసిందని చెప్పారు.పత్తికొండ లో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని పత్తికొండ న్యాయవాదులు గత నాలుగు సంవత్సరాలనుండి వివిధ రూపల్లో ఆందోళన కార్యక్రమలు నిర్వహించడం జరిగిందన్నారు. గతంలో మాజీ ఎం.ఎల్.ఏ కు, ప్రస్తుతం ఉన్న ఎం. ఎల్. ఏ కు న్యాయ వాదులు వినతిపత్రం ఇచ్చారని తెలిపారు. ప్రస్తుత ఎంఎల్.ఏతో కలసి న్యాయశాఖ మంత్రికి కూడా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించామన్నారు. జిల్లా న్యాయమూర్తులకు కూడా పత్తికొండ న్యాయవాదులు వినతిపత్రం ఇచ్చారని చెప్పారు .అలాగే రాష్ట్ర సచివాలయం లోని న్యాయ శాఖ విభాగం లోకూడా వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. అయిన కూడా ఎలాంటి ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేశారు..పత్తికొండ న్యాయవాదులు వివిధ రూపల్లో ఆందోళనలు కార్యక్రమలు నిర్వహిస్తున్న పాలక కూటమి ప్రభుత్వనికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆరోపించారు .పత్తికొండ పట్టణంలోని మండ్రో తోపులో కోర్టుకు 2 ఎకరాలు భూమి కూడా ఉందని చెప్పారు.

ఈ భూమి ని కొంతమంది కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తే పత్తికొండ న్యాయవాదులు అడ్డుకున్నారని గుర్తు చేశారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మిగనూరు లో ఒక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మరియు ఆదోని లో మరో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయడంతో పత్తికొండ లో కూడా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని పత్తికొండ న్యాయవాదులు ఆశపడ్డారని చెప్పారు. అయితే పత్తికొండ కు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు కాకపోవడంతో పత్తికొండ న్యాయవాదులు ఆశలపై నీళ్లు చల్లినట్లు అయిందని వాపోయారు.పత్తికొండ ప్రాంత న్యాయ వాదులు మరియు కాక్షిదారులు దూరప్రాంతమైన ఆదోని కోర్టుకు పోవలసి వస్తుందని ఈ విదంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆదోనికి పోవడానికి కనీసం బస్సులు కూడా సరిగా లేవని గంటల తరబడి బస్సులు కోసం వేసిచుడవలసిన పరిస్థితి దాపూరించిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆదోనిలో ఇప్పటి కె సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఉందని తిరిగి అక్కడే మరో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు కు మంజూరు చేసారని పేర్కొన్నారు..ఆలా చేయడం వలన పత్తికొండ ప్రాంత పరిధి కేసులను ఆదోని రెండో అదనపు కోర్టులో వాదనలు వినిపించవలసి వస్తుందని ఇది చాలా బాధాకరమైన విషయం అన్నారు .పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు ఈ ప్రాంత ప్రజలు,న్యాయవాదులు,కాక్షిదారుల శిరకాల కోరిక అని అన్నారు.ఈ ప్రాంత న్యాయవాదులు మరియు కాక్షిదారులు ఎంతో వ్యయ ప్రయాసలకు కోర్చి ఆదోనికి పోతున్నారని చెప్పారు .పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు అయితే వారి కష్టాలు తిరుతాయని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు కు కృషి చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో న్యాయవాదులు బి. వీరస్వామి, పి. వాసుదేవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ అగ్ర నాయకులు చంద్ర రాజేశ్వరరావు జయంతి వేడుకలు

### - ఘనంగా నివాళులర్పించిన రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి రామచంద్రయ్య



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం :** భారత కమ్యూనిస్టు ఉద్యమ ప్రముఖ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు చంద్ర రాజేశ్వరరావు 112వ జయంతి సందర్భంగా పత్తికొండలోని స్థానిక చదువుల రామయ్య భవన్‌లో ఘనంగా జయంతి ఉత్సవాలు సిపిఐ పట్టణ కార్యదర్శి ఎన్ రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి. రామచంద్రయ్య హాజరై చంద్ర రాజేశ్వరరావు గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య గారు మాట్లాడుతూ, చంద్ర రాజేశ్వరరావు గారు జీవితాంతం పేదలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం పోరాడిన మహోన్నత నాయకుడని చంద్ర రాజేశ్వరరావు గారి భావజాలం మరింత ప్రాసంగికంగా మారిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యులు డి.రాజా సాహెబ్ జిల్లా సమితి సభ్యులు గురుదాస్ సురేంద్ర కుమార్ సుల్తాన్ పెద్ద వీరన్న ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు వెంకటరాముడు మండల సహాయ కార్యదర్శి కాశీం పట్టణ సహాయ కార్యదర్శి ఎంకే సుంకన్న ఏఐటియుసి నాయకులు గుండు భాష ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సి శివ శ్రీనివాసులు రామాంజనేయులు హనుమన్న లతోపాటు పార్టీ ప్రజాసంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై అవగాహన



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి ఈరోజు 06-06-2026 తేది న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు పిలుపు మేరకు, గుంతకల్లు నియోజకవర్గం శా సనసభ్యులు గుమ్మనూరు జయ రాం ఆధ్వర్యంలో ఆయన తనయుడు గుత్తి, పామిడి ఇంచార్జ్ యువనేత గుమ్మనూరు ఈ శ్వర్ ఆదేశాల మేరకు గుత్తి పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గుత్తి పట్టణ అధ్యక్షులు ఎంకె చౌ దరి ఎస్ఐఆర్, కార్యక్రమంపై నియో జకవర్గం పరిధిలో ఉన్న 8,9,10 క్లస్ట ర్ యూనిట్ ఇన్చార్జిలు, బూత్ కన్వీ నర్లు,వార్డు ఇన్చార్జిలకు ప్రత్యేక అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఎస్ఐఆర్,కార్య క్రమం అనగా ఓటరు జాబితా సరి చూసుకొని ఏవైనా అభ్యంతరాలు ఉంటే బిఎల్ఓలకు తెలియపరచాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కు సర్వం సిద్ధం కావాలని ఈ సంద ర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, వార్డు ఇన్‌ఛార్జిలు, సీ నియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

# కూటమి ప్రభుత్వం హామీల అమలులో విఫలమైంది

### - వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు పూర్తికావస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైయస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం పేరుతో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, నేడు వాటి అమలుపై ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉందన్నారు. ప్రజలు సమాధానం కోరుతున్నారు.

**రైతులు, మహిళలు:** రైతులకు ఇచ్చిన హామీలు ఎక్కడ ఉన్నాయి? మహిళలకు ప్రకటించిన పథకాలు ఏ స్థాయిలో అమలవుతున్నాయి?

**నిరుద్యోగులు:** నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం ఎంతవరకు విజయం సాధించింది? విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్నలకు ప్రజలు సమాధానం కోరుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట చెప్పడం ప్రజలను మోసం చేయడమే. ప్రజల సమస్యల పరిష్కారం కంటే ప్రచార కార్యక్రమాలకే ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది.అని మంజునాథ్ రెడ్డి విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని.. ఎన్నికల హామీల అమలుపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల తరఫున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నరేష్, చంద్రశేఖర్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

# పుట్లూరు నూతన తహశీల్దార్‌గా బాలమ్మ బాధ్యతల స్వీకరణ



**పుట్లూరు – సూర్య వాస్తవం:** పుట్లూరు మండల నూతన తహశీల్దార్‌గా బాలమ్మ స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇంతకుముందు ఆత్మకూరు మండలంలో డిప్యూటీ తహశీల్దార్‌గా సమర్థవంతమైన సేవలు అందించారు. అక్కడ సాధించిన ఉత్తమ పని తీరుకు గానూ, ఆమెకు తహశీల్దార్‌గా పదోన్నతి (ప్రమోషన్) లభించింది. పదోన్నతిపై పుట్లూరు మండలానికి వచ్చిన ఆమెకు స్థానిక రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానని, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు.

# పెన్నానదిలో ఇసుక దోపిడీ

### - పగలు రాత్రి తేడా లేకుండా అక్రమ రవాణా!



**పెద్దపప్పూరు– సూర్య వాస్తవం :** మండలంలో ఇసుక అక్రమ రవాణా అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. రాజకీయ నాయకుల అండదండలతో అక్రమార్కులు పట్టపగలే పెన్నానదిని తోడేస్తున్నారు. కుమ్మెత గ్రామ పరిధిలోని పెన్నానది ఇందుకు ప్రధాన కేంద్రంగా మారింది. సరిహద్దులు దాటుతున్న ఇసుక. భారీగా దందా! ?కుమ్మెత గ్రామం దగ్గర నది నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను యాడికి మండలం మీదుగా జిల్లా సరిహద్దులకు తరలిస్తు న్నారు. అక్కడ డంప్ చేసి, ఆపై పెద్ద టిప్పర్ల ద్వారా బళ్లారి, బెంగళూరు, కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సామాన్యుడికి ఇసుక దొరకని పరిస్థితి ఉంటే. అక్రమార్కులు మాత్రం ఒక ట్రాక్టర్ ఇసుకను ?8,000 నుండి ?10,000, టిప్పర్ ఇసుకను రూ.25,000 నుండి రూ.30,000 చొప్పున విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నారు. అడుగంటుతున్న భూగర్భ జలాలు అధికారుల నిర్లక్ష్యం ?ప్రభుత్వం అనుమతించిన ఇసుక రేవు ఒక్కటి కూడా లేకపోయినా ఈ దందా నిరాటంకంగా సాగుతోంది. నదిలో విచ్చలవిడిగా లోతు తవ్వకాలు జరపడం వల్ల భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటుతున్నాయని రైతులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, కొందరు అధికారులు దాడుల సమాచారాన్ని అక్రమార్కులకు ముందే లీక్ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

**“కఠిన చర్యలు తీసుకుంటాం”**

”పెన్నానదిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. పోలీస్, మైనింగ్ అధికారులతో మాట్లాడి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం. సామాన్యులకు ఉచితంగా ఇసుక అందేలా చూస్తాం. **– బాలాజీరాజు తహసీల్దారు, పెద్దపప్పూరు**

# నిబంధనలు తప్పనిసరి..

### - డీలర్లకు వ్యవసాయ శాఖ ఆదేశం!



**మడకశిర – సూర్య వాస్తవం :** మడకశిర నియోజకవర్గ కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యం లో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లతో శుక్రవారం ఒక ముఖ్యమైన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, రైతులకు విక్రయించే ప్రతి ఒక్క లీటరు లేదా కిలో సరుకు వివరాలను పారదర్శకంగా ఉంచాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్‌లో ప్రతి అమ్మకాన్ని నిమిషాల వ్యవధిలో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు జారీ చేసిన కీలక ఆదేశాలు, రైతులకు విక్రయించిన ప్రతి సందర్భంలోనూ నకిలీలకు తావులేకుండా తప్పనిసరిగా ఒరిజినల్ బిల్లులు అందజేయాలి. దుకాణాల పరిధిలోని బిల్ బుక్స్, సేల్స్ రిజిస్టర్లను క్రమం తప్పకుండా అప్‌డేట్ చేస్తూ నిబంధనల ప్రకారం నిర్వహించాలి. రైతులకు ఇబ్బంది కలగకుండా, దుకాణంలో ఉన్న స్టాక్ లభ్యత వివరాలను ప్రతిరోజు నోటీస్ బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలి. నిబంధనలు ఉల్లంఘించి, రికార్డులలో తేడాలు చూపిస్తే డీలర్లపై చట్టపరమైన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు.

# రామకోటి పుస్తకాల పంపిణీ

### - సరస్వతికి అభినందనలు తెలిపిన ఆర్ఎస్ఎస్ నాయకులు

**పామిడి – సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలో మడికట్ల ఆంజనేయ స్వామి దేవాలయం లో రామకోటి పుస్తకాలు భక్తులకు సరస్వతి ఆధ్వర్యంలో పంపిణి చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంకు పట్రా పుల్లయ్య అధ్యక్షులుగా, ముఖ్య అతిధిగా వ్యక్తిత్వ వికాస నిపుణులు లీలా మనోహర్, సభా ఉపన్యాసులుగా ఆర్ఎస్ఎస్ నాయకులు జోజెడే కుమార్, రైజింగ్ రాజశేఖర్, దస్తకర్ పవన్,సుంకన్న, కుమార్, రవి, దామోదర్ రెడ్డి, రాము నారాయణ స్వామి,రామ్మోహన్, వెంకట రామిరెడ్డి, రవితేజ, కృష్ణా,యజ్ఞ సాయు, మంజునాథ్ హరికృష్ణ చంద్ర కళ పద్మ, లక్ష్మీదేవి పాల్గొని రామ కోటి మీద తమ అభిప్రాయాలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం లో గుడి పూజారులు, అధ్యాత్మక చింతన కార్యకర్తలు, భక్తాదులు. మహిళా మూర్తులు పాల్గొని భక్తి పార వస్యం పొందారు. అందరు ముక్త కంఠంతో మడికట్ల ఆంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి తొడ్పాటు అందిస్తామని తెలిపారు.



# జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు
# పాఠశాలలో ఉచిత విద్య అమలు చేయండి

## - ఏపీయుడబ్ల్యూజే డిమాండ్



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కొన్నేళ్లుగా అనంతపురం ఉమ్మడి జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో అమలు అవుతున్న ఉచిత విద్య ను ఈ సంవత్సరం అమలు చేయండని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లు పయ్యావుల ప్రవీణ్, మహమ్మద్ ఆయుఫ్ ఆధ్వర్యంలో ఇవాళ కలెక్టర్ ఓ ఆనంద్ కు యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 25% సీట్లు పేద పిల్లలకు ఉచితంగా ఇవ్వాలన్న నిబంధన అమలు లో భాగంగా జర్నలిస్టుల పిల్లలకు అది వర్తింపజేయాలని కోరారు. ప్రతి సంవత్సరం కలెక్టర్ ఆదేశాలతో విద్యాశాఖ ఈ విషయం పై మెమో ఇస్తుందని తెలిపారు. మెమోను అధికారుల ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు పంపాలని కోరారు. గత సంవత్సరం కలెక్టర్ గా ఉన్న వినోద్ కుమార్ విద్యా సంస్థల్లో రాయితీ కల్పిస్తూ మెమో ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే రిపోర్టర్లతో పాటు స్ట్రింగర్లుగా, కాంట్రిబ్యూటర్లుగా పనిచేస్తున్న వారికి ఒకటి, రెండు సంస్థల లో నామమాత్రపు గౌరవ వేతనం వస్తుంది. చాలా సంస్థలలో అది అందరి పరిస్థితి నెలకొంది. అనంతపురం జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో పిల్లల పాఠశాలల ఫీజులు చెల్లించే స్థితిలో జర్నలిస్టులు లేరు. ఈ జిల్లాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో జర్నలిస్టుల పిల్లల కు ఫీజుల్లో రాయితీ అమలయ్యేలా పెద్ద మనసుతో విద్యాశాఖను ఆదేశించగలని డిమాండ్ చేశారు వెంటనే అందుకు సంబంధించిన మెమో ఇచ్చి జర్నలిస్టుల పిల్లలకు ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభం అయ్యేలోగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మహమ్మద్ ఆయుఫ్, మహమ్మద్ రసూల్, ఆర్‌వీఎస్ ప్రసాద్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు నాగేంద్ర నాథ్ రెడ్డి, యూనియన్ స్టేట్ కౌనిల్ సభ్యులు బాల రంగారెడ్డి, కేపీ కుమార్, చిన్న పత్రికల నాయకులు చౌదప్ప, చలపతి, సనప రామకృష్ణ, లోకరాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మోపూరి భైరవేశ్వర దేవస్థానం నూతన చైర్మన్ ప్రమాణస్వీకారం

- నూతన చైర్మన్ ఆలయ పురోభివృద్ధికి అంకితభావంతో సేవలు అందించాలి
- హాజరై శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి



**వేముల - సూర్య వాస్తవం :** పులివెందుల నియోజకవర్గం, నారెపల్లి గ్రామంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ మోపూరి భైరవేశ్వర స్వామి దేవస్థానం నూతన చైర్మన్‌గా ఓబుళరెడ్డి రమణ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ వేడుకకు శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేవస్థాన ప్రాంగణంలో శాస్త్రోక్తంగా జరిగిన ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం, నూతన చైర్మన్ ఓబుళరెడ్డి రమణ రెడ్డిని ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవ స్థానాన్ని మరింత ఆధ్యాత్మిక శోభతో, అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. స్వామివారి కృపతో నూతన చైర్మన్ ఆలయ పురోభివృద్ధికి అంకితభావంతో సేవలు అందించా లని కోరారు. ఈ కార్యక్రమం కూటమికి నాయకులు పులివెందుల టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి బిజెపి నాయకులు శశిభూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అగ్రదేశాల సరసన భారతదేశాన్ని నిలబెట్టడంలో వాజ్ పేయి కృషి

## - భారతదేశం గర్వించదగ్గ రాజనీతిజ్ఞుడు వాజ్ పేయి
## - వాజ్ పేయి విగ్రహావిష్కరణ సభలో ప్రముఖులు



**పులివెందుల - సూర్య వాస్తవం:** భారతదేశాన్ని అగ్రదేశాల సరసన నిలపడంలో వాజ్ పేయి విశేష కృషి చేశారని వాజ్‌పేయి విగ్రహావిష్కరణ సభలో ప్రముఖులు పేర్కొ న్నారు. మాజీ ప్రధాన మంత్రి భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమము శనివారం పులివెందులలో కూటమి సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టెలికం ఆఫీస్ వాజపేయి సర్కిల్ వద్ద పివిఎన్ మాధవ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, శాసనసభ్యులు ఆదినారాయణ రెడ్డి, శాసనమండలి సభ్యుడు రాంగోపాల్ రెడ్డి, పులివెందుల టిడిపి ఇన్చార్జ్ రవీంద్రనాథ్ రెడ్డి, రాయలసీమ జోనల్ సమన్వయకర్త రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, ఆంధ్రప్రదేశ్ మార్క్ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్ రెడ్డి మరియు బిజెపి జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి తదితర మహారథుల ఆధ్వర్యంలో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి చిన్నతనం నుంచే దేశభక్తిని అలవర్చుకొని, స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, పాత్రికేయుడు, వక్తగా రాణించారని, వాజ్‌పేయి భారతదేశానికి మూడుసార్లు ప్రధాన మంత్రిగా సేవలు అందించి భారతదేశం ఎన్నో అద్భుతమైన విజయాలను సాధించారని వాటిలో ప్రధానంగా 1998లో జరిగిన 'పోఖ్రాన్ అణుపరీక్షలతో' భారత్ ప్రపంచ స్థాయి అగ్రదేశాల సరసన నిలపడం, కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం సాధించిన విజయానికి ఆయన నాయకత్వమే ప్రధాన బలం.

దేశానికి ఆయన చేసిన సేవలలో దేశంలోని ప్రధాన నగరాలను కలుపుతూ స్వర్ణ చతుర్భుజి మరియు గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యాన్ని కల్పించే 'ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన' పథకాలను తీసుకువచ్చారని, "సర్వ శిక్షా అభియాన్" ద్వారా ప్రతి ఒక్కరికీ విద్య అందేలా కృషి చేశారు. విదేశాంగ విధానంలో భారత్‌కు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకువచ్చారు. రాజకీయ నాయకుడిగానే కాకుండా, ఆయన మంచి కవి. ఆయన రాసిన ఎన్నో కవితలు, దేశభక్తి గేయాలు ప్రజల హృదయాలను దోచుకున్నాయి. అందుకే ఆయనను దేశం అజాతశత్రువు గా కొనియాడ పడుతున్నారని, దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడటంలో ఎప్పుడూ రాజీ పడలేదని, దేశ భద్రతను బలోపేతం చేయడానికి అగ్రరాజ్యాల ఒత్తిడిని సైతం ఎదిరించారని, సమాజంలో చివరి వరుసలో ఉన్న పేదవాడికి కూడా ఫలాలు అందాలనే సిద్ధాంతాన్ని నమ్మారని, ఆయన ఆశయాలు, దేశభక్తి మరియు ఆయన ప్రసంగాలు ఎప్పటికీ మనకు స్ఫూర్తిదాయకం. భారతదేశం ఉన్నంత కాలం వాజ్‌పేయి పేరు చిర స్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ భాను ప్రకాష్, సుంకర శ్రీనివాస్ జనసేన ఉమ్మడి జిల్లా సమన్వయకర్త మరియు ఇతర కూటమినేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బ్రూస్లీ తైక్వాండో అకాడమీ సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలు

- ముఖ్య అతిథిగా పామిడి ఎస్ఐ రాఘవేంద్రప్ప, శ్రీ చైతన్య స్కూల్ సీఈఓ సంతోష్ రెడ్డి





**పామిడి- సూర్య వాస్తవం :** గుంతకల్ నియోజకవర్గం పామిడి పట్టణం నందుగల శ్రీ సత్య బ్రూస్ లీ తైక్వాండో అకాడమీ సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పామిడి పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రాఘవేంద్రప్ప ,శ్రీ చైతన్య స్కూల్ సీఈవో సంతోష్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి,పిల్లలకు తైక్వాండో నేర్చుకోవడం వల్ల వచ్చే ఉపయోగాలను పిల్లలకు తల్లిదండ్రులకు తెలియజేశారు. అనంతరం తైక్వాండో క్రీడాకారుల అందరికీ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రజా దర్బార్‌లో వృద్ధులు, వికలాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టిన మంత్రి మండిపల్లి



**రాయచోటి - సూర్య వాస్తవం:** స్థానిక ఎస్.ఎన్.కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శనివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగానియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను మంత్రి స్వయంగా అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక చొరవ చూపించి ,వారి వినతులను పరిశీలించి తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.ప్రజలకు అందు బాటులో ఉండటం, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి అన్నారు. ప్రతి సమస్యను సానుకూలంగా పరిశీలించి ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజా దర్బార్‌కు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ వినతులను మంత్రికి అందజేశారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమం టిడిపి శ్రేణులు, ఫారెస్ట్ డెవలప్మెంట్ డైరెక్టర్ రెడ్డయ్య యాదవ్, మండల అధ్యక్షుడు సుధాకర్, చీర్ల సుధాకర్, మాజీ కౌన్సిలర్ రియాజ్, టిడిపి మైనార్టీ నాయకుడు ఇర్షాద్, ఖాదర్ ఖాన్, బర్కతుల్లా, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 9న రాష్ట్రవ్యాప్తంగా జరిగే రాస్తారోకోను జయప్రదం చేద్దాం

- సిపిఐ, సిపిఎం వామపక్షాలు




**పామిడి- సూర్యవాస్తవం:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9 మంగళవారంన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రాస్తారోకో నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్థానిక సిపిఎం కార్యా లయంలో శనివారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి.

ఈ సందర్భంగా సిపిఐ సిపిఎం సీనియర్ నాయకులు కే.రహీం పి.అనిమిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెట్రోలు,డీజలు,నిత్యవసర వస్తువులు, సరుకులు, ఎరువులు, విద్యుత్ బిల్లులు, తదితర వాటిపై ధరలను పెంచి ప్రజలకు పెను బారమును మోపిందని, వావపక్షాలు పోరాటాల ద్వారా సాధించిన ఉపాధి హామీ పథకం పేరు మార్చి జీరామ్ జీ పేరును పెట్టాలన్న నిర్ణయాలను ఉపసంహరించుకోవాలన్నారు. మతతత్వపు విధానాలను, కార్పొరేట్ విధానాలను వదులుకోవాలని, కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర కూటమిప్రభుత్వం వత్తాసు పలుకుతున్న వైఖరిని తక్షణమే మానుకోవాలన్నారు. ఇప్పటికే ధరలపై ధరలు 4,5 సార్లు పెంచడంవల్ల పేద బడుగు బలహీన వర్గాల కుటుంబాల ప్రజలు భరించలేకపోతున్నారని వారు ఆవేదన వ్యక్తపరిచారు. రాస్తారోకోలో రైతు సంఘాలు, వ్యవసాయ కార్మికులు, సీఐటియు, మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు, హమాలి,డ్రైవర్ల, ఉపాధిహామికార్మికులు, అంగన్వాడి వర్కర్లు, వ్యవసాయ కార్మికులు, భవన కార్మికులు, రైతులు, ప్రజలు, ప్రభుత్వాలపై వ్యతిరేక భావాలు కలిగిన ప్రజలు తదితరులు పాల్గొని రాస్తారోకో కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కె రహీం,పి అనిమిరెడ్డి, గజ్జలదస్తగిరి,మల్లేష్ నాగరాజు నరసింహులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణంలో ఉన్న స్మార్ట్ కిచెన్‌ను పరిశీలించిన శేషారెడ్డి



**వేముల - సూర్య వాస్తవం :** వేముల మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న స్మార్ట్ కిచెన్ పనులను శనివారం టీడీపీ సీనియర్ నాయకుడు పేర్ల శేషారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని పంచాయతీ రాజ్ ఏఈ అబ్దుల్లా ను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా,నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. స్మార్ట్ కిచెన్ అందుబాటులోకి వస్తే విద్యార్థులు మరియు లబ్ధిదారులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించడానికి ఇది ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# విష్ణువర్ధన్ రెడ్డిని కలిసిన మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి



**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో అటల్ బిహారీ వాజ్పేయి కాంచ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన కదిరి బిజెపి నేషనల్ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి హాజర య్యారు. విష్ణువర్ధన్ రెడ్డిని పులివెందుల టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి వెంకటరామిరెడ్డి బిజెపి నాయకుని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశాల్వాతో సత్కరించే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ఆయనతో మద్దూరివెంకటరామిరెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా పులివెందుల రాజకీయాల గురించి వెంకట్రామిరెడ్డిని అడిగి ఆయన తెలుసుకున్నారు. జరగబోయే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసే కూటమి ప్రభుత్వం గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు కార్యక్రమంలో ఓబుల్ రెడ్డి, గంగిరెడ్డి, జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేపు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

- 16న ఛలో విజయవాడ
- ప్రభుత్వ ఆసుపత్రి ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఆందోళనలకు పిలుపు



**వేంపల్లె - సూర్య వాస్తవం :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఎంవోయూ ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ జూన్ 8న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు, జూన్ 16న "ఛలో విజయవాడ" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కేసీ బాదుల్లా పిలుపునిచ్చారు. శనివారం వేంపల్లెలో కరపత్రాలను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు అందకపోవడంతో ఇంటి అద్దెలు, విద్యుత్ బిల్లులు, రుణాల చెల్లింపులు చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎంవోయూ ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ మినహాయించి రూ.13,960 వేతనం చెల్లించాల్సి ఉండగా, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. 50 సంవత్సరాలు నిండిన పారిశుధ్య కార్మికులను తొలగించడం అన్యాయమని పేర్కొన్న ఆయన, 10 నుంచి 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల 10వ తేదీలోపు వేతనాలు చెల్లించడం, కార్మిక చట్టాలను అమలు చేయడం, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించడం వంటి అంశాల్లో అధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. నిబంధనల అమలు కోరుతున్న కార్మికులను తొలగిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్న ఏజెన్సీ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూన్ 8న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ఆందోళనలకు, జూన్ 16న నిర్వహించే "ఛలో విజయవాడ" కార్యక్రమానికి కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు బళ్లారపు రామాంజనేయులు, నాయకులు పి. సుబ్బరాయుడు, అంజనేయులు, రమణ, రవి తదితరులు పాల్గొన్నారు.

# కన్న ప్రేమను మించిన ప్రేమ ఈ సృష్టిలో మరొకటి లేదు

- తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టంపై అవగాహన




**చెన్నూరు- సూర్య వాస్తవం :** కన్న ప్రేమను మించిన ప్రేమ ఈ సృష్టిలో మరొకటి లేదని, మనకు జన్మనిచ్చి, పెంచి పెద్ద చేసి సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించుకునేలా చేసిన దేవతలు తల్లిదండ్రులేనని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ-కమ్-సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శనివారం మండలంలోని రామనపల్లె, కొక్కరాయపల్లె, కనపర్తి ఎస్టీ తండాలలో "తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల సంక్షేమ చట్టం--2007"పై న్యాయ విజ్ఞాన సదస్సు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ అమరావతి ఆదేశాలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప సూచనల మేరకు ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో త్యాగాలు చేస్తారని, అయితే నేటి సమాజంలో కొందరు వృద్ధాప్యంలో వారిని భారంగా భావించడం బాధాకరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం, వృద్ధాశ్రమాలకు పంపించడం, మానసికంగా, శారీరకంగా వేధించడం వంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధులకు చట్టపరమైన రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 2007లో తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చిందని వివరించారు.

ఈ చట్టం ప్రకారం వృద్ధ తల్లిదండ్రులను లేదా వయోవృద్ధులను ఉద్దేశపూర్వకంగా వదిలిపెడితే మూడు నెలల వరకు జైలు శిక్ష లేదా రూ.5 వేల వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు. అలాగే ప్రతి డివిజన్ స్థాయిలో ఆర్డీఓ ఆధ్వర్యంలో మెయింటెనెన్స్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి, వృద్ధులకు త్వరితగతిన న్యాయం అందించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.




వృద్ధులకు సంతానం లేకపోయినా, వారి ఆస్తిపై వారసత్వ హక్కు పొందే ఇతర బంధువులు కూడా వారిని పోషించాల్సిన బాధ్యత ఈ చట్టం ప్రకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వయోవృద్ధుల హక్కులు, వారికి అందుబాటులో ఉన్న చట్టపరమైన రక్షణల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ఆశా వర్కర్లు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, పారా లీగల్ వాలంటీర్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కాటమరాయుడి సన్నిధిలో జనసేన రాష్ట్ర నాయకులు

- ఖాద్రీ ఆలయంలో ప్రత్యేక పూజలు

**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం:** శ్రీ సత్య సాయి జిల్లా పర్యటనలో భాగంగా జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు, ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కండే రాజేష్ శనివారం రాత్రి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన శ్రీమద్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు మొదట కదిరి ఆర్యవైశ్య సంఘ కార్యాలయం వద్దకు రాగానే ఆయనకు కదిరి ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. తన మిత్రులతో కలిసి వచ్చిన రాజేష్ ఖాద్రీ ఆలయంలో ప్రత్యేక పూజలు పాల్గొన్నారు ఈ సందర్భంగా కాద్రీశుడి దర్శనం అనంతరం రాజేష్ కు ఖాద్రి ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలతో పాటు వస్త్రం ప్రసాదాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యకులు వికాష్,,కదిరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మేడ వరప్రసాద్, సెక్రెటరీ ఏం ఆనంద్ బాబు, ట్రెజరర్ వి.జనార్ధన, ఎస్ శంకరయ్య ,గొట్లూరు అశ్వత్త నారాయణ, యువజన సంఘం అధ్యక్షులు పబ్బతి మురళీమోహన్, సుబ్బారాయుడు, దన్విత్, నాగేష్ జనసేన నాయకులు ప్రభుత్వ ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సభ్యులు కుటాల లక్ష్మణ్ పాల్గొన్నారు.



# ఘనంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

- చేసిన ఏపీఐఐసి డైరెక్టర్ రామకృష్ణ
- ఈ కెవైసి, భూ రికార్డులపై రైతులకు అవగాహన



**మడకశిర - సూర్య వాస్తవం :** నియోజకవర్గంలోని రొళ్ల మండలం తూబినకుంట గ్రామంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని 250 మంది అర్హులైన రైతులకు ఏపీఐఐసి డైరెక్టర్ రామక్రిష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి తన చేతుల మీదుగా పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో భూ రికార్డుల ప్రాధాన్యత ఎంతైనా ఉందని, వాటిని సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. దీంతో పాటు ప్రభుత్వ పథకాలు, రెవెన్యూ సేవలను రైతులు సులభంగా పొందేందుకు వీలుగా ఈ కేవైసి ప్రక్రియపై రైతులకు పూర్తి అవగాహన కల్పించారు. ప్రభుత్వ రెవెన్యూ సేవలను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు. ఈ పాస్ పుస్తకాల పంపిణీ మహోత్సవంలో మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, మండల కన్వీనర్ ఈరన్న, సింగిల్ విండో అధ్యక్షులు దాసారెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, సర్వేయర్ కిరణ్, వీర్వో లక్ష్మీనరసప్ప, సిబ్బందితో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.


# ఉపాధి హామీ పథకం రద్దు దురదృష్టకరం

- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె- సూర్య వాస్తవం :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి దాని స్థానంలో కొత్త పథకాన్ని అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించడం దురదృష్టకరమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విమర్శించారు. శనివారం వేంపల్లెలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంలో, వలసలను తగ్గించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఉపాధి హామీ పథకంగా గుర్తింపు పొందిన ఈ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చట్టబద్ధత కల్పించారని తెలిపారు.పథకం పేరు నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం జాతిపితను అవమానించడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. కొత్త విధానంలో కేంద్రం వాటా తగ్గించి రాష్ట్రాలపై అధిక ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు. దీనివల్ల భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల సమీకరణలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ విషయంలో ప్రాంతీయ పార్టీలైన టిడిపి, జనసేన, వైకాపా మద్దతు ఇవ్వడం విచారకరమని తులసి రెడ్డి పేర్కొన్నారు.

# వృషభలేశ్వర స్వామిని దర్శించుకున్న బీటెక్ రవి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** పులివెందుల తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ ఎం. రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) శనివారం వేంపల్లె సమీపంలోని శ్రీ వృషభలేశ్వర దేవస్థానాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు హరి ప్రవీణ్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవస్థానం చైర్మన్ పీవీ రమణ దుశ్యాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను పరిశీలించిన బీటెక్ రవి, దేవస్థాన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. దేవస్థానం చుట్టూ ప్రకారం, రాజగోపురాల నిర్మాణం, ఆలయ ప్రాంగణంలో ఫ్లోరింగ్ పనులు, ఎద్దుల కొండ అడుగు భాగం నుంచి శిఖరం వరకు ఉన్న రహదారికి రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించిన అంచనాల (ఎస్టిమేట్లు) వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల అంచనాలు సిద్ధమైన వెంటనే తనకు తెలియజేయాలని సూచించారు. దేవస్థానం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వేంపల్లి మండల పరిశీలకులు అంజుగట్టు రఘునాథ రెడ్డి, మండల కన్వీనర్ ఎస్. రామమునిరెడ్డి, తుంగభద్ర హై లెవెల్ కెనాల్ చైర్మన్ ఎం. జోగిరెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మహమ్మద్ షబ్బీర్, వేంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ వివరాలను దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కడప సుభాష్ మరియు దేవస్థానం చైర్మన్ పీవీ రమణ వెల్లడించారు.

# రేషన్ అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

- జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరిక





**తాడిపత్రి - సూర్య వాస్తవం :** పేద ప్రజల పొట్ట కొట్టి, వారికి అందాల్సిన ప్రభుత్వ రేషన్ సరుకులను అక్రమ మార్గానికి తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జె.సి. ప్రభాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు అందే బియ్యం, ఇతర నిత్యావసర వస్తువుల సరఫరాలో పారదర్శకత లోపిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. బ్లాక్ మార్కెట్‌పై నిఘా: పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులు ప్రైవేట్ వ్యాపా రులకు, మిల్లులకు అమ్ముకుంటున్నారనే ఫిర్యాదులపై ఆయన స్పందించారు. రేషన్ దారి మళ్లింపుపై గట్టి నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. **డీలర్లకు హెచ్చరిక:** లబ్ధిదారులను కొలతల్లో మోసం చేసినా, సకాలంలో సరుకులు పంపిణీ చేయ కుండా ఇబ్బందులకు గురిచేసినా డీలర్‌షిప్‌లు రద్దు చేయడమే కాకుండా చట్టపరమైన క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలలో కూడా ఎటువంటి అక్రమాలకు పాల్పడిన తగిన చర్యలు ఉంటాయని అన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తుండాలి అని చెప్పారు. అర్హులందరికీ అందాలి: ప్రభుత్వం ఖర్చుతో పేదలకు అందిస్తున్న ప్రతి గింజా అర్హులైన కుటుంబాలకే చేరాలన్నదే తమ కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

# కాక్‌టెయిల్-2 లో నటించడానికి భయపడ్డా: రష్మిక



కొద్ది రోజుల్లో 'కాక్‌టెయిల్ 2'తో ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతోంది అందాల తార రష్మిక. ఆమె, షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో దియా పాత్రలో కనిపించనుంది రష్మిక.

ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న రష్మిక.. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. 'ఈ ప్రాజెక్టులో నటించడం గురించి నేను అంత సులభంగా నిర్ణయం తీసుకోలేదు. ముఖ్యంగా ఇందులో నటించడానికి నిజంగా భయపడ్డాను.

ఎందుకంటే ఇప్పటి వరకు నేను భాగమైన చిత్రాల్లో ఇంత మోడ్రన్‌గా కనిపించలేదు. అందుకే ప్రారంభంలో ఈ చిత్రంలో నటించడం గురించి నేను తీసుకున్న నిర్ణయం సరైందా? కాదా? అనే సందేహం ఉండేది. కానీ అదే సమయంలో ఇంతకు ముందెప్పుడూ ఇలాంటి పాత్రలో చేయలేదు కాబట్టి.. ఇందులో నటించాను' అని చెప్పింది.

## జూలై నుంచి కల్కి-2 రెగ్యులర్ షూటింగ్




ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న 'కల్కి 2' అప్‌డేట్ గురించి నాగ్ అశ్విన్ క్లారిటీ ఇచ్చారు.

సినిమా పనుల గురించి వివరణ చేస్తూ.. కల్కి 2 షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. వచ్చే జూలై నుండి కంటిన్యూగా షూటింగ్ ప్లాన్ చేశాం. చాలా శరవేగంగా షూటింగ్ పూర్తి చేసేలా అన్ని సన్నాహాలు జరుగుతున్నాయని నాగ్ అశ్విన్ వెల్లడించారు. ఈ అప్‌డేట్‌తో ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

# విమర్శలు కూడా సృజనాత్మకతగానే చూడాలి

## నటి అనసూయా భరద్వాజ్



సినిమా అంటేనే కేవలం కల్పిత కథ అని.. అందులోని తప్పొప్పులు నిర్ణయించుకునే పూర్తి విచక్షణ మనపైనే ఉంటుందని నటి అనసూయ భరద్వాజ్ అన్నారు. సమాజంలో జరిగే విషయాలకు సినిమాలతో ముడిపెట్టొద్దని అన్నారు. చిత్రరంగంపై బాధ్యత, సృజనాత్మక స్వేచ్ఛ గురించి ఆమె సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

'ఒకప్పటి కథలలో నైతికత కనిపించేది. హీరో పాత్రలు స్ఫూర్తిదాయకంగా ఉండేవి. విలన్ పాత్రలు మనం అనుకరించకూడదు అనిపించేలా ఉండేవి. ఈ రోజుల్లో తెరకెక్కే కథల్లో ఈ స్పష్టత లోపిస్తోంది. పాత్రను గొప్పగా చూపించడం కోసం దర్శకులు ఈ గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఒక కథను తెరకెక్కిస్తున్నామంటే.. దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిలో టెక్నికల్ టీమ్ నుంచి దర్శక నిర్మాతలు, నటీనటులు, చివరకు ప్రేక్షకులు కూడా కీలక పాత్రధారులే. అందుకే సినిమా ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఉండాలి. సృజనాత్మకత విషయంలో వచ్చిన భేదాభిప్రాయాల వల్ల నేను కొన్ని షోల నుంచి వైదొలిగిన సందర్భాలూ ఉన్నాయి. దానివల్ల నా ప్రతిభకు తగిన అవకాశాలు రావడంలో ఇబ్బందులూ ఎదుర్కొన్నా. అంత కష్టంలోనూ నా సిద్ధాంతాల కోసమే నిలబడ్డాను అని అనసూయ చెప్పారు. సృజనాత్మక స్వేచ్ఛ అనేది చాలా అవసరం. అదే సమయంలో సామాజిక స్పృహ ఉండటం కూడా అంతే ముఖ్యం. సినిమాలు సమాజాన్ని మంచి మార్గంలో ముందుకు నడిపించాలని ఆశించకూడదు. అలాగని సమాజంపై ఎలాంటి ప్రభావం చూపవని కూడా అనుకోకూడదు. సమాజంలో జరిగే ప్రతి విషయానికి సినిమాను నిందించలేం. సోషల్ మీడియాలో చాలామంది ముందుకువచ్చి ఇలాంటి విషయాలపై చర్చలు పెట్టడం, కథల్లో పాత్రలను చూపించే విధానాలను ప్రశ్నించడం, విమర్శనాత్మకంగా ఆలోచించడాన్ని చూస్తుంటే నాకు నిజంగా సంతోషంగా ఉంది. అవసరమైనప్పుడు తప్పులను ప్రశ్నించడం అంటే సృజనాత్మకతపై దాడి చేయడం కాదు, అది సమాజంలో అవగాహన పెంచడం మాత్రమే' అని అనసూయ వివరించారు.



# భారత్ డబల్ ధమాకా

- పురుషుల జట్టుకు స్వర్ణం, మహిళల జట్టుకు కాంస్యం
- ఆసియా కప్ అండర్-18 హాకీ

కాకమిగహారా(జపాన్): ఆసియాకప్ అండర్-18 హాకీ టోర్నమెంట్‌లో భారత యువ ఆటగాళ్లు అంచనాలకు మించి రాణించారు. పురుషుల విభాగంలో భారత జట్టు స్వర్ణ పతకం కైవసం చేసుకోగా.. మహిళల జట్టు కాంస్య పతకాన్ని సాధించింది. దీంతో భారత అండర్-18 పురుషుల హాకీ జట్టు ఆసియా కప్ 2026లో చరిత్ర సృష్టించింది. జపాన్‌లోని కాకమిగహారాలో శనివారం జరిగిన ఫైనల్లో భారతజట్టు 4-1గోల్స్ తేడాతో ఆతిథ్య జపాన్‌ను చిత్తు చేసింది. దీంతో రికార్డు స్థాయిలో మూడోసారి ఆసియా కప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. లీగ్ దశలో జపాన్ చేతిలో ఓడిన భారత యువ జట్టు ఫైనల్లో జపాన్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించింది. స్టార్ ఫార్వర్డ్ ఆశిష్ పుర్తి హ్యాట్రిక్ గోల్స్‌తో జపాన్ డిఫెన్స్ ను ఛేదించగా... టీం స్కోర్ కు కెప్టెన్ కేతన్ కుష్వాహా మరో గోల్ జోడించాడు. జపాన్ తరఫున గాకు నుమాడా ఒక్క గోల్ మాత్రమే సాధించగలిగాడు. ఇటీవలే పాకిస్థాన్‌పై సెమీఫైనల్లో నాలుగు గోల్స్‌తో మెరిసిన ఆశిష్ పుర్తి.. ఫైనల్లోనూ అదే జోరు కొనసాగించి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. అతడి అద్భుత ప్రదర్శనతో టైటిల్ పోరులో జపాన్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వ కుండా భారత యువ జట్టు విజేతగా నిలిచింది.



### మెరిసిన మహిళల జట్టు

ఇక భారత మహిళల జట్టు కాంస్య పతక పోరులో పటిష్ట కొరియాను చిత్తు చేసింది. మూడవ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-0 గోల్స్ తేడాతో కొరియాపై విజయాన్ని నమోదు చేసింది. సందీప్ కుమారి, స్వీటీ కుజుర్, నౌషీన్ నాజ్‌లు భారత్ తరఫున గోల్స్ చేశారు. సెమీఫైనల్స్ మ్యాచ్‌లో చైనా చేతిలో షూటౌట్ ఓడిన భారత జట్టు కాంస్య పతకం కోసం గట్టిగా పోరాడింది. ఆరంభంలోనే డ్రీమ్ స్టార్ట్ అందింది. తొలి రెండు నిమిషాల్లోనే సందీప్ కుమారి గోల్స్ చేసింది. దీంతో ఇండియా ఈ మ్యాచ్‌లో దూకుడు ప్రదర్శించింది. మ్యాచ్ మొత్తం ఇండియా జట్టు అటాక్ చేసింది. ఇక ఆట 16వ నిమిషంలో స్వీటీ కుజుర్ ఫీల్డ్ గోల్‌తో ఆధిక్యాన్ని పెంచింది. రెండు గోల్స్‌తో భారత మహిళల జట్టు మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఆ తర్వాత మళ్లీ 33వ నిమిషంలో భారత్‌కు మరో గోల్ దక్కింది. నౌషీన్ ఆ గోల్ స్కోరు చేసింది. ఈ టోర్నీలో నౌషీన్ తన ఖాతాలో మొత్తం 12 గోల్స్ చేసింది. సందీప్ కుమారి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకుంది.కీలో పతకాలు సాధించిన పురుషుల, మహిళల జట్టుకు భారత ప్రధాని మోడీ ట్విటర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.




# టి20 కెప్టెన్‌గా శ్రేయాస్ -- వైభవ్‌కు చోటు

- -15 ఏళ్లకే సూర్యవంశీ జాతీయ జట్టుకు ఎంపికై రికార్డు పుటల్లోకి..
- -- ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు జట్టు ఎంపిక

ముంబయి: భారత క్రికెట్ జట్టు టి20 కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ ఎంపికయ్యాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భాగంగా ఆడే టి20 సిరీస్‌కు శ్రేయస్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేస్తున్నట్లు శనివారం బిసిసిఐ సెలెక్షన్ కమిటీ ప్రకటించింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి టి20 జట్టులో చోటు కల్పించింది. 15ఏళ్లకే జాతీయ జట్టులో చోటు దక్కించుకొని సచిన్ పేరిట 36 ఏళ్ల క్రితం ఉన్న రికార్డును బ్రేక్ చేసాడు. ఇండియా టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించి ఆ బాధ్యతలను శ్రేయాస్ అయ్యర్‌కు అప్పగించారు. ఐర్లాండ్ పర్యటనలో భాగంగా ఇండియా రెండు టి20లు ఆడనుంది. జూన్ 26, 28న ఆ మ్యాచ్‌లు డబ్లిన్‌లో జరగనున్నాయి. ఇక జూలై ఒకటో తేదీ నుంచి 11 తేదీ వరకు ఇంగ్లండ్‌తో ఐదు టి20 మ్యాచ్‌లు జరగనున్నాయి. లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌తో పాటు 2028లో జరగబోయే టీ20 వరల్డ్‌కప్‌ను దృష్టిలో పెట్టుకుని ప్లేయర్లను ప్రకటించారు. రెండు దేశాలతో జరిగే టి20 సిరీస్ కోసం తిలక్ వర్మను వైస్ కెప్టెన్‌గా ప్రకటించారు.

**ఐర్లాండ్, ఇంగ్లండ్ సిరీస్‌లకు భారత జట్టు:**

శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివం దూబే, తిలక్ వర్మ(విసి), నితీశ్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, సిరాజ్, హర్షిత్ రాణా, అర్షదీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ

## డీఏపీ ఎరువుల పంపిణీపై శిక్షణ ఏడీఏ



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని సిల్ఆర్సి భవనంలో ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లతో వ్యవసాయ అధికారులకు, డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఏడీఏ వెంకట రాముడు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఇకపై రైతులకు యూరియా, డీఏపీ పంపిణీ చేయాలంటే ప్రభుత్వం తయారు చేసిన యాప్ను విని యోగించుకొని పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు.

## వైసీపీ కార్యకర్తకు నివాళులర్పించిన చెన్నకేశవరెడ్డి

**పామిడి -సూర్య వాస్తవం :**



పామిడి మండలం రామగిరి తండాకి చెందిన వైయస్సార్ పార్టీ కార్యకర్త, లక్ష్మణ్ నాయక్‌కు యాక్సిడెంట్‌లో మృతి చెందిన విషయం తెలుసుకున్న అనంతపురం, జిల్లా వైఎస్ఆర్సిపి ఆర్గనైజేషన్ సెక్రెటరీ, పామిడి చెన్నకేశవరెడ్డి, వెళ్లి పూలమాలవేసి నివాళులర్పించారు, ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్, రామకృష్ణ నాయక్,పామిడి, టౌన్ కన్వీనర్ నాగూర్ ఈశ్వర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి పామిడి సూరి వాల్మీకి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టి కార్యదర్శి, మురళి నాయక్,మాజీ మండల కన్వీనర్, పాళ్యం నారాయణరెడ్డి,బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, పామిడి మండల బీసీ సెల్ అధ్యక్షుడు, చీమల నాగేష్ యాదవ్, కొత్తపల్లి రమేష్, సాయి, ఉదయ్, వెంకటేష్ కప్ప, వెంకటేష్, సైదులు, బాబావాలి, రామగిరి తండా, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు నివాళులర్పించారు.

## ప్రజా సమస్యలపై తక్షణం స్పందించండి

### - తహశీల్దార్ వి రెడ్డిశేఖర్



**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం:** ప్రజా సమస్యలపై వీఆర్వోలు తక్షణం స్పందించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కదిరి తహసిల్దార్ వి రెడ్డి శేఖర్ సూచించారు. రెడ్డి శేఖర్‌కు తహసీల్దార్‌గా పదోన్నతి వచ్చిన సందర్భంగా కదిరి అర్బన్, రూరల్ మండల విఆర్వోలు శనివారం తహసిల్దార్ ఛాంబర్‌లో రెడ్డిశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ప్రజలు సమస్యల పైన మన వద్దకు వచ్చినప్పుడు వాటిని తెలుసుకొని పరిశీలించి సాధ్యమైనంత వరకు చూసి ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చూడాల్సిన బాధ్యత మన పైన ఉందని పేర్కొన్నారు. ప్రజలలో రెవెన్యూ శాఖ పైన మంచి అభిప్రాయం ఉండే విధంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రజలు సమస్యల పైన ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి మార్గం చూపాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కులం, ఆదాయం, నేటివిటీ సర్టిఫికెట్లను కూడా లాగిన్లలో పెండింగ్ పెట్టుకోకుండా ఎప్పటికప్పుడు వాటిని క్లియర్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్డిటీ రవి ప్రసాద్, ఆర్ఐ విజయ్ విఆర్వోలు పాల్గొన్నారు.

## తహసీల్దార్ రెడ్డి శేఖర్‌ను సన్మానించిన ఖాద్రి ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు

**కదిరి- సూర్య వాస్తవం:** ఇటీవల కాలంలో తహసిల్దార్ గా పదోన్నతి పొందిన కదిరి తహసిల్దార్ వి.రెడ్డి శేఖర్‌ను శ్రీమద్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు గొట్లూరు అశ్వత్థ నారాయణ శనివారం తహసీల్దార్ ఛాంబర్ లో ఘనం గా సన్మానించారు. ఈ సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలేశ్వర స్వామివారి ప్రసాదం చిత్రపటాన్ని తహశీల్దార్‌కు ఇచ్చి తన అభిమానాన్ని చాటుకున్నారు.



# సార్‌పై శిక్షణ విజయవంతం

### - వై. నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ స్టేట్ పరిశీలకులు, డీసీఎంస్ చైర్మన్

**హిందూపురం -సూర్య వాస్తవం:** హిందూపూర్ నియోజకవర్గంలో జే వి ఎస్ ప్యాలెస్ లో రాష్ట్ర టీడీపీ పార్టీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం, ప్రియతమ శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో ( సార్ )ఓటర్ జాబితా చేర్పులు, మార్పులు, తొలగింపు, ఎన్నికల కసరత్తు, నిర్వహణ పై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ అనిల్ కుమార్ , ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచరులు సురేంద్ర, బాలాజీ, రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, మండల స్థాయి, క్లస్టర్, యూనిట్, బూత్, బూత్ కో కన్వీనర్స్ మరియు ముఖ్య టీడీపీ నాయకులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్బంగా అనిల్ కుమార్, దయా సాగర్ మరియు వై. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ మన రాష్ట్రం లో ఈ నెల 15న ప్రారంభం కాబోతున్న ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ (సార్ ) పై అప్రమత్తంగా ఉండాలని, ఓటర్ల జాబితా సవరణపై దిశా నిర్దేశం





చేశారు. సార్ లోనూ కూటమి పార్టీల మధ్య సమన్వయం ఉండాలని తెలిపారు. ఎలక్షన్ కమిషన్ వారు ప్రతి 25 ఏండ్లకు ఒక్కసారి నిర్వహించే ఓటర్ లిస్ట్ సమగ్ర ప్రక్షాళన కార్యక్రమం లో భాగంగా 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను చేపడుతున్నారని, జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ జరుగుతుందని, ఈ రెండు సార్లు మ్యాపింగ్ జరిగేలోగా ఓట్ల చేరికలు పర్ఫెక్టుగా పూర్తి కావాలన్నారు. సార్ ను అందరూ సీరియస్‌గా తీసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆయన తెలిపారు.ఓట్లు నమోదు చేసుకోవడం ఓటర్ల బాధ్యతైతే, ఓట్ల చేరికలపై ప్రజలకు అవగాహన కల్పించడం మన ప్రాథమిక బాధ్యతగా చంద్రబాబు సార్ తెలిపారని, కావున ప్రతి ఒక్కరు పార్టీ గెలుపు కొరకు పని చేయాలనీ, పార్టీ బలంగా ఉంటే ప్రభుత్వం మరింత బలంగా ఉంటుందన్నారు. కావున సార్ పై ప్రతి ఒక్కరు జాగ్రత్తగా వ్యవహారించాలని పార్టీ పతిష్టతకు పాటుపడాలని ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఓటర్ల జాబితా అత్యంత కీలకమని అన్నారు. ఓటర్ల జాబితా ఆధారంగానే ఎన్నికల వ్యూహాలు, కార్యాచరణ ప్రణాళికలు రూపొంది ంచుకోవచ్చని చెప్పారు.ఎస్.ఐ.ఆర్ ను ప్రతి ఒక్క నాయకుడు, ప్రతి కార్యకర్త అత్యంత సీరియస్‌గా తీసుకోవాలి. ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని, అలాగే సార్ ప్రక్రియ సకాలంలో పూర్తి అయ్యేలా చూడడం తో పాటు, ఓటర్ల జాబితాలో తమ ఓట్లు ఉన్నాయా లేదా అన్నది ప్రతి ఒక్కరూ నిరంతరం పరిశీలించాలని, అర్హత గల ఓటర్లు ఒకరు కూడా మిస్ కాకుండా, నకిలీ ఓట్లు నమోదు కాకుండా చూడాలని వీఆర్వో మరియు ఏఈఆర్ వారితో క్రమం తప్పకుండా సమన్వయం కొనసాగిస్తూ బూత్ కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రతి ఒక్క బూతులో గరిష్టంగా 1200 ఓట్లు మాత్రమే ఉండేలా ఈ. సి మార్గదర్శాలను పాటించాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఏపీకి అంతర్జాతీయ పెట్టుబడులు

### - దక్షిణ కొరియా ఫుట్‌వేర్ సంస్థ 'షూఆల్స్'తో మంత్రి పయ్యావుల కేశవ్ కీలక చర్చలు



**ఉరవకొండ-సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రముఖ దక్షిణ కొరియా ఫంక్షనల్ ఫుట్‌వేర్ దిగ్గజం 'షూఆల్స్ ప్రతినిధులతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రెండోసారి సమావేశమై కీలక చర్చలు జరిపారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల విస్తరణ, పాదరక్షల ఉత్పత్తి రంగంలో పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఈ ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. రెండు విడతల చర్చలు: తొలి సమావేశం ముగిసిన తక్కువ వ్యవధిలోనే రెండోసారి భేటీ కావడం, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుపై ప్రభుత్వం చూపిస్తున్న ప్రత్యేక చొరవకు నిదర్శనంగా నిలిచింది. యువతకు భారీగా ఉపాధి: ఈ అంతర్జాతీయ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలోని స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పూర్తి సహకారం: షూఆల్స్ సంస్థ రాష్ట్రంలో ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తే వేగవంతమైన అనుమతులు అవసరమైన మౌలిక వసతులు మరియు మెరుగైన పారిశ్రామిక రాయితీలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆర్థిక ప్రగతి - ఎగుమతులు: ఏపీని పారిశ్రామిక పెట్టుబడులకు దేశంలోనే అత్యంత అనుకూల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని, ఈ ప్రాజెక్ట్ వల్ల ఎగుమతులు పెరిగి రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రం మారుతుందని పయ్యావుల కేశవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమల స్థాపనకు ఆంధ్రప్రదేశ్ వేదికగా నిలవబోతోంది. పెట్టుబడిదారులకు అవసరమైన అన్ని వసతులను వేగంగా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.

## తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మమ్మ

**నంబుల పూలకుంట- సూర్య వాస్తవం:** ఎన్ పి కుంట నూతన తాసిల్దారుగా లక్ష్మమ్మ బాధ్యతలు స్వీకరించారు తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బదిలీలో భాగంగా డిప్యూటీ తహసిల్దార్ నుండి పదోన్నతులు పొంది తహసిల్దార్ శనివారం బాధ్యతలు స్వీకరించడం జరిగింది అని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు ప్రజలకు ప్రభుత్వ



పథకాలు అందే విధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు ప్రజలకు అందుబాటులో ఉంటూ భూ సమస్యలు లేకుండా చూస్తామన్నారు. మండలంలో ఎటువంటి సమస్య ఉన్న మా దృష్టికి వస్తే పరిష్కరించే తోడ్పడుతామని తెలిపారు

## 12న శ్రీ రుక్మిణి పాండురంగస్వామి కళ్యాణ మహోత్సవం




**పామిడి- సూర్య వాస్తవం:** పామిడి బావ సార క్షత్రియ డబ్బీదారు ఫిర్క వారి ఆధ్వర్యంలో ఈనెల 12 శుక్రవారంన నూతనంగా నిర్మించబడిన శ్రీరుక్మిణి పాండురంగస్వామి పెద్దవిఠోబా దేవాలయంలోజరగబోవు శ్రీరుక్మిణి సమేత పాండురంగస్వామి మండలాభిషేక శుభలగ్న పత్రికను శ్రీభాగవత దురంధర అనుశీపల్లె భాస్కర స్వామి చేతుల మీదుగా ఆహ్వాన పత్రికను పూజ చేసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యవర్గం,కమిటీ సభ్యులు, నాయకులు పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీపై రివ్యూ నిర్వహించండి

### - ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌కి బీటెక్ రవి వినతి

**పులివెందుల - సూర్య వాస్తవం:**



పులివెందుల మెడికల్ కాలేజీలో ఉద్యోగుల నియామకానికి సంబంధించి పూర్తిస్థాయిలో రివ్యూ నిర్వహించాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కు బీటెక్ రవి సూచించారు. శనివారం పులివెందులలో వాజ్ పేయి విగ్రహావిష్కరణ సభలో పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి మాట్లాడుతూ పులివెందుల మెడికల్ కాలేజీకి సంబంధించి అస్తవ్యస్త విధానాలతో అసంపూర్తిగా నిలిచి ఆగమేఘాల మీద ప్రారంభోత్సవం నిర్వహించి మొత్తం ఉద్యోగ అవకాశాలను తన వందిమా గదులకు అవకాశాలు కల్పించి నిరుద్యోగులకు మొండి చేయి చూపించి ఈ ప్రాంత నిరుద్యోగ యువతను అన్ని విధాలుగా అన్యాయం చేశారని కేవలం సాక్షి పత్రిక మరియు వారి అనుబంధ సంస్థలలో ఇంటి ఆవరణలో పనిచేసే వారికి భార్యాభర్తలకు ఇరువురికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని వీటిపై ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ గారు రివ్యూ నిర్వహించాలని పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి అభ్యర్థించారు. పులివెందుల మున్సిపాలిటీలోని దూచీూ కార్యాలయం వద్ద భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ మహోన్నత కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డితో కలిసి పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ విగ్రహా విష్కరణ మహోత్సవంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )